

సభా స్థలంలో డ్యాన్స్ చేస్తున్న మహిళలు



సీఎం సభకు వస్తున్న వృద్ధులు



వివిధ గ్రామాల నుంచి సీఎం సభకు తరలివస్తున్న జనం

# కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్

- బోధన్ గులాబీ శ్రేణుల్లో నయా జోష్
- సీఎం కేసీఆర్ ప్రసంగానికి జనం ఫిదా

బోధన్, నవంబర్ 15: బోధన్‌లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. గతంలో ఎన్నడూ కనీవిని ఎరుగని రీతిలో బుధవారం బోధన్ పట్టణ శివారులో బోధన్ – నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన నిర్వహించిన సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు జనం పోటెత్తింది. బోధన్ నియోకవర్గ నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివచ్చిన జనంతో ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో కొందరు ప్రజలు రోడ్లపైనే ఎక్కడివారక్కడ నిలిచిపోయారు. సభా వేదిక నుంచి కంటికి కనిపించని దూరంలో వేలాది మంది ప్రజలు సీఎం కేసీఆర్ ప్రసంగం వినేందుకు ఎదురుచూస్తుండడం కనిపించింది. బహిరంగసభలో సీఎం ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను మరోసారి గెలిపించాలని కేసీఆర్ పిలుపు ఇవ్వగానే సభికుల నుంచి హర్షధ్వానాలు వచ్చాయి. 'ధరణి' కావాలా.. వద్దా.., రైతుబంధు కావాలా వద్దా.. అంటూ సభికులకు కేసీఆర్ ప్రశ్నించినప్పుడు జనం 'కావాలి.. కావాలి..' అంటూ కేకలు వేశారు. 'మూడు గంటల కరెంట్ సరిపోతుందా.. అని కేసీఆర్ ప్రశ్నించగా.. సరిపోదు.. సరిపోదు.. అంటూ జనం సమాధానమిచ్చారు. 'ధరణి కావాలన్నా.. రైతుబంధు కావాలన్నా.. వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ కావాలన్నా.. బోధన్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌ను గెలిపించాలని సీఎం కేసీఆర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఇందుకు సభలోని జనం నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రజా ఆశీర్వాదసభ గులాబీ శ్రేణుల్లో నయా జోష్ నింపింది. కేసీఆర్ సభకు హాజరైన వేలాది మంది జనం స్పందనను చూసిన రాజకీయ పరిశీలకులు ఈ సభతో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ గెలుపు ఖాయమైందని అంటున్నారు.

### సీఎం కేసీఆర్ సభకు జనసందోహం

శక్కర్‌నగర్, నవంబర్ 15: బోధన్ పట్టణ శివారులో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు ఉదయం 10 గంటల నుంచే సభా ప్రాంగణానికి నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చారు. సభా ప్రాంగణం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలతో నిండిపోగా, పలువురు ప్రాంగణం బయటే నిలుచుని సీఎం కేసీఆర్ ప్రసంగంతోపాటు పలువురి ప్రసంగాలను వీక్షించారు.

### సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం

ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రాక సందర్భంగా ఆయనకు హెలిప్యాడ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పూదోట రవికిరణ్ ఘన స్వాగతం పలికారు. సీఎం బోధన్‌కు హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుకుని హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక బస్సులో సభా వేదికపైకి చేరుకున్నారు. ఎమ్మెల్యే షకీల్ ప్రసంగం అనంతరం సీఎం తన ప్రసంగాన్ని మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభించి 29 నిమిషాల పాటు కొనసాగించారు. తెలుగుతో పాటు హిందీలోనూ మాట్లాడారు. సభ అనంతరం బోధన్ నుంచి హెలీక్యాప్టర్‌లో సీఎం కేసీఆర్ నిజామాబాద్‌లో నిర్వహించిన సభకు వెళ్లారు. సీఎం కేసీఆర్ రాక సందర్భంగా నిర్వహించిన సభకు ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



హెలీప్యాడ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సభలో కేసీఆర్ చిత్రపటంతో అభిమానం చాటుతున్న మహిళ

# సీఎం సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

నవీపేట, నవంబర్ 15: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు బోధన్‌లో నిర్వహించిన సీఎం సభకు వాహనాల్లో తరలి వెళ్లారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని 32 గ్రామాల పరిధిలో నుంచి 250 వాహనాల్లో 15 వేల మందికి పైగా ప్రజలు సర్పంచులు, ఎంపీటీసీలు మండల ఇన్‌చార్జిల నాయకత్వంలో వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఈనెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే షకీల్ విజయమే లక్ష్యంగా మండలంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు పని చేస్తున్నాయని అన్నారు. సీఎం సభకు వెళ్లిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, దొంత ప్రవీణ్‌కుమార్, మంత్రి సాయికుమార్‌గౌడ్, సూరిబాబు, న్యాలకంటి అబ్బన్న, తదితరులు ఉన్నారు.

### రెంజల్ నుంచి..

రెంజల్, నవంబర్ 15: బోధన్ పట్టణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ తరపున నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, ప్రజలు తరలి వెళ్లినట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు వాహనాలు, బస్సుల్లో సభకు చేరుకున్నట్లు తెలిపారు.

### ఎడపల్లి మండలం నుంచి..

ఎడపల్లి, నవంబర్ 15: బోధన్ పట్టణంలోని నర్సాపూర్ రోడ్డు వద్ద నిర్వహించిన సీఎం ప్రజాఆశీర్వాద సభకు ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వెళ్లారు. కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

### బోధన్ మండలం నుంచి..

బోధన్ రూరల్ , నవంబర్ 15: బోధన్ పట్టణంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు బోధన్ మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. ఈ మార్గంలో రోడ్లన్ని జనంతో నిండిపోయాయి.



ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామం నుంచి సీఎం సభకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు

## రాంరెడ్డికి బీఆర్‌ఎస్ నాయకుల నివాళి

నవీపేట,నవంబర్ 15: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎన్.రాంరెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు. మండల కేంద్రంలో రఘుపతిరెడ్డి గార్డెన్‌లో రాంరెడ్డి 11రోజు వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, పార్టీ నాయకులు రాంరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. రాంరెడ్డి భార్య భారతి, కుమారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సోదరులు నర్సారెడ్డి, ఎన్ఎన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, సూరిబాబు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లోకం నర్సయ్య, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోధన్‌లో ఒకరి నామినేషన్ ఉప సంహరణ

శక్కర్‌నగర్, నవంబర్ 15: బోధన్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వేసిన నామినేషన్లలో ఓ అభ్యర్థి ఉపసంహరించుకున్నట్లు బుధవారం ఉపసంహరించుకున్నారు. శివసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పసులేటి గోపికిషన్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో బి.రాజా గౌడ్ వెల్లడించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శక్కర్‌నగర్, నవంబర్ 15: బోధన్ పట్టణం బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్–14 విభాగం ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. గతనెల 31న నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎం.గంగాధర్, పి.లస్మవ్వ ప్రతిభచూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎండీ అజీముద్దీన్ తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ సౌజన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి

రెంజల్, నవంబర్ 15: మండలంలోని దండిగుట్ట గ్రామంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లోకి చేరినట్లు పార్టీ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి బుధవారం తెలిపారు. దండిగుట్ట గ్రామానికి బోదాస్ కొమరయ్య, శంకర్, వెంకటేశ్, కంది మల్లయ్య, జి. కృష్ణ, బానోవత్ మోహన్, కేతవాత్ రాంచందర్, హరిప్రసాద్, దండుగుల రాజు, నవీన్ కాంగ్రెస్ పార్టీని వీడి పార్టీ మండల అధ్యక్షుడు భూమారెడ్డి, జిల్లా మైనార్టీ నాయకుడు రఫిక్, మండల నాయకుడు కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రవినాయక్ తదితరులు ఉన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు